సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



ఆస్పత్రులపై తూ.కొ. శాఖ దాడులు

నెల్లూరులోని పలు ఆస్పత్రులపై తూనికలు, కొలతల శాఖాధికారులు గురువారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 22 కేసులు నమోదు చేశారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.59,390
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,305
3 శాతం జీఎస్టీతో	రూ.5,464
నవర (8 గ్రా)	రూ.43,712

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.3 /22.5

గురువారం గాలిలో 64 శాతం తేమ ఉంది. శుక్రవారం చలితో కూడిన పొడి వాతావరణం ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లాలో నాలుగు కొత్త ఇసుకరీచ్‌లు

- కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో నూతనంగా మరో నాలుగు ఇసుకరీచ్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు తెలిపారు. నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన ఇసుకరీచ్‌లపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు, అనంతసాగరం మండలంలోని పడమటికంభంపాడు, విడవలూరు మండలంలోని ముదివర్తి, ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల వివరాలను మైన్స్ అండ్ జియాలజీ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజల అవసరాల మేరకు ఇసుకను సరఫరా చేయాలని చక్రధర్‌బాబు ఆదేశించారు. సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ డీడీ సూర్యచంద్రరావు, ఏడీ శ్రీనివాసరావు, భూగర్భ జలశాఖ డీడీ శోభన్‌బాబు, ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, డీపీఓ చిరంజీవి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు 83 ప్రత్యేక బస్సులు

నెల్లూరు(క్రైమ్): మహా శివరాత్రి సందర్భంగా భక్తుల కోసం ఈనెల 18వ తేదీన నెల్లూరు రీజియన్ నుంచి వివిధ శైవక్షేత్రాలకు 83 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని జిల్లా రవాణా ప్రాంతీయ అధికారి పీవీ శేషయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలి నుంచి లింగసముద్రం మీదుగా మొగిలిచెర్లకు పది బస్సులు, కావలి నుంచి కొమ్మి మీదుగా మొగిలిచెర్లకు 8, కావలి నుంచి సాయిపేట మీదుగా మొగిలిచెర్లకు 7, కందుకూరు నుంచి మొగిలిచెర్లకు 25 బస్సులు నడుస్తాయన్నారు. నెల్లూరు పీఎస్‌ఆర్ బస్టాండ్ నుంచి గండవరానికి 5 బస్సులు, పొదలకూరు నుంచి కోటితీర్థానికి ఒకటి, నెల్లూరు నుంచి శ్రీశైలానికి 2 బస్సులు తిరుగుతాయన్నారు. ఉదయగిరి నుంచి భైరవకోనకు 4, సీతారామపురం నుంచి భైరవకోనకు 3, సీతారామపురం నుంచి సిద్ధేశ్వరపురానికి 3, ఉదయగిరి నుంచి సిద్ధేశ్వరపురానికి 3, సిద్ధేశ్వరపురం నుంచి కోవిలంపాడుకు 2, పోరుమామిళ్ల నుంచి కోవిలంపాడుకు 5 బస్సులు, నెల్లూరు నుంచి కాటేపల్లికి 5 బస్సులు నడుపుతామని తెలిపారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

- ఎస్పీ విజయారావు

నెల్లూరు(క్రైమ్): జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశించారు. నెల్లూరులోని పోలీసు కార్యాలయంలో ఉన్న మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి గురువారం ఆయన జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ జరగనున్న నేపథ్యంలో అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రాజీమార్గం ప్రాధాన్యతను ఇరువర్గాలకు తెలియజేసి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్‌తో సమస్యలకు సత్వర, శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులతోపాటు దంపతుల మధ్య అపరిష్కృతంగా కోర్టుల్లో ఉన్న కేసుల్లో ఉభయపక్షాల వారికి రాజీ కుదిర్చి ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని పొందవచ్చన్నారు. ఆ దిశగా ఉభయ పక్షాలు ఆలోచన చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్టార్ లైనర్ సర్వీసులు ప్రారంభం

నెల్లూరు(క్రైమ్): ప్రయాణికుల కోసం నెల్లూరు నుంచి హైదరాబాద్, బెంగళూరుకు స్టార్ లైనర్ పేరిట నాన్ ఏసీ స్లీపర్ బస్సులను గురువారం నుంచి ప్రారంభించామని జిల్లా రవాణా ప్రాంతీయ అధికారి పీవీ శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు రోజూ రాత్రి 10.30 గంటలకు బస్సు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు బీహెచ్‌ఈఎల్ చేరుకుంటుందన్నారు. హైదరాబాద్ నుంచి రోజూ రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.05 గంటలకు నెల్లూరుకు వస్తుందన్నారు. అప్పర్ బెర్త్‌కు రూ.1,114, లోయర్ బెర్త్‌కు రూ.1.211 చార్జీ వసూలు చేస్తున్నామని చెప్పారు.

- నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి రోజూ రాత్రి 10.15 గంటలకు బస్సు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు బెంగళూరు చేరుతుందన్నారు. అక్కడి నుంచి రాత్రి 10.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.05 గంటలకు నెల్లూరుకు వస్తుందన్నారు. అప్పర్ బెర్త్‌కు రూ.910, లోయర్ బెర్త్‌కు రూ.990 చార్జి వసూలు చేస్తున్నామని చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శేషయ్య కోరారు.

ప్రైవేట్ సేవలో పెద్ద డాక్టర్లు



నెల్లూరులోని పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి).. దీని అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది. ఇక్కడికి జిల్లా నలుమూలల నుంచి పేద రోగులు వస్తుంటారు. వారికి ఉచితంగా వైద్యం అందించేందుకు అనేక సౌకర్యాలున్నాయి. అయితే ఆస్పత్రిలోని కొందరు పెద్ద డాక్టర్లు మాత్రం రోగులను పట్టించుకోకుండా ప్రైవేట్ హాస్పిటల్స్ సేవలో తరిస్తున్నారు. రోజూ కాసేపు ఉండి మొక్కుబడిగా విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారు.

జీజీహెచ్‌లో ఇష్టారాజ్యంగా కొందరు సీనియర్ వైద్యులు

- ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు
- ఫేస్ రికగ్నిషన్ హాజరు వేసి.. కాసేపటికి జంప్
- రోగులకు జూనియర్ డాక్టర్లే దిక్కు
- రక్తపరీక్షలను ఆపేస్తున్న వైనం

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా బోధనాస్పత్రిగా ఉన్న నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)లో డాక్టర్ల పోస్టులను భర్తీ చేసింది. ఆధునిక వసతులతో కూడిన భవనాలు సమకూరాయి. సీటీ, ఎంఆర్‌ఐ లాంటి స్కానింగ్ మెషీన్లను అందుబాటులోకి తెచ్చారు. ఓ వైపు పేదల కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నా కొంతమంది డాక్టర్ల తీరు దారుణంగా ఉంది. దీంతో రోగులకు వైద్యం చేసేందుకు జూనియర్ డాక్టర్లే దిక్కవుతున్నారు.

కాసేపు ఉండి..

పేద రోగులకు పక్కాగా వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం డాక్టర్లకు ఫేస్ రికగ్నిషన్ హాజరును ప్రవేశపెట్టింది. ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు సాయంత్రం 4 గంటలకు ఆస్పత్రిలో హాజరు వేయాలని జీఓ జారీ చేసింది. కొందరు సీనియర్ డాక్టర్లు దీనిని తుంగలో తొక్కుతున్నారు. ఉదాహరణకు ఓ మానసిక వైద్యుడికి పొగతోటలో ప్రైవేట్ ప్రాక్టీస్ ఉంది. ఆయన ఉదయం 9 గంటలకు వచ్చి హాజరు వేస్తారు. పట్టుమని పది నిమిషాలు కూడా ఓపీలో ఉండరు. వెంటనే సొంత క్లినిక్‌కు వెళ్లిపోతారు.



ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూలో ఉన్న జనం (ఫైల్)

మళ్లీ మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి హాజరు వేసి వెంటనే వెళ్లిపోతారు. మళ్లీ నాలుగు గంటలకు వచ్చి హాజరు వేస్తారు. మరో ఆర్థోపెడిక్ డాక్టర్‌ది ఇదే దారి. అలాగే క్యాజువాలిటీలో ఎమర్జెన్సీ డాక్టర్ సైతం అందుబాటులో ఉండటంలేదు.

అనేకమంది అంతే..

చాలామంది సీనియర్ డాక్టర్లు ఒక గంటో.. రెండు గంటలో ఉంటారు. రోగులకు రక్త పరీక్షలు, స్కానింగ్ రాస్తారు. వారు ఆ పరీక్షలు చేయించుకుని ఓపీకి వచ్చే సరికి డాక్టర్లుండరు. ప్రైవేట్ ప్రాక్టీస్‌కు వెళ్లిపోతారు. కొందరికి సొంత హాస్పిటల్స్ ఉండగా, మరికొంతమంది ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేస్తున్నారు. ఉదయం 12 గంటలు దాటితే అనేకమంది సీనియర్ డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. ఫలితంగా జూనియర్ డాక్టర్లు రోగులకు వైద్యసేవలందిస్తున్న పరిస్థితి ఏర్పడింది. వారితో వైద్యం చేయించుకోవడం ఇష్టం లేకుంటే రెండోరోజు మళ్లీ ఆస్పత్రికి రావాలి.

ఆగిపోతున్న పరీక్షలు

పెద్దాస్పత్రిలో ఖరీదైన ఆటోఅనలైజర్ లాంటి మెషీన్లున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి నిధులు జమవుతున్నాయి. ఇంకా సెల్‌టవర్ లాంటి వాటి ద్వారా మరికొంత ఆదాయం వస్తోంది. ప్రభుత్వం మరికొన్ని నిధులను విడుదల చేస్తోంది. వీటిని అత్యవసర మందులు స్థానికంగా కొనుగోలు చేసేందుకు, రక్త పరీక్షలకు సంబంధించిన రియేజెంట్స్ కొనుగోలుకు ఉపయోగించుకోవచ్చు. పెద్దాస్పత్రిలో ఖరీదైన మెషీన్లున్నా వాటిలో రియేజెంట్స్ లేక పలు రకాల రక్తపరీక్షలు చేయడం లేదు. ఏరోజు, ఏ రక్తపరీక్ష ఆపేస్తారో తెలియదు. ఆర్ఏ ఫ్యాక్టర్, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్ లాంటి పరీక్షలు ఆపేశారు. రోగులు అడిగితే నిన్ననే రియేజెంట్స్ అయిపోయాయని ల్యాబ్ టెక్నీషియన్లు చెబుతున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

జీజీహెచ్‌లో..

డాక్టర్లు	227 మంది
నర్సింగ్ సిబ్బంది	సుమారు 300 మంది
రోజుకు సరాసరి ఓపీ	1,100 నుంచి 1,200
ఇన్‌పేషెంట్లు	సుమారు 500 మంది
రోజూ జరిగే కాన్పులు	35 నుంచి 40

నిబంధనలకు నీళ్లు

వాస్తవానికి డాక్టర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలి. మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఓపీలో వైద్యసేవలందించాలి. తర్వాత వైద్య విద్యార్థులకు తరగతులు నిర్వహించాలి. డాక్టర్లున్నారా.. లేదా.. సమయ పాలన పాటిస్తున్నారా లేదా అని ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారులు పరిశీలిస్తూ సూపరింటెండెంట్‌కు నివేదించాలి. ఇక్కడ అడ్మినిస్ట్రేషన్ అధికారులు వాస్తవ పరిస్థితి సూపరింటెండెంట్‌కు నివేదించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరిదారి వారిదేనన్న చందంగా తయారైంది.



ఏసీఎస్‌ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల భవనం

నిర్లక్ష్యానికి ఉదాహరణలు

- గత వారంలో జనరల్ సర్జరీ విభాగంలో నగరానికి చెందిన ఓ వ్యక్తి అడ్మిషన్ పొందాడు. కేస్‌షీట్‌లో సీనియర్ డాక్టర్ పేరుంది. వాస్తవానికి ఆయనకు రోగి ఉన్నట్లు కూడా తెలియదు. జూనియర్ డాక్టర్ వైద్యం చేశాడు. ఈ విషయం ఆలస్యంగా సీనియర్ డాక్టర్‌కు తెలిసింది. రోగికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకం.
- ఇటీవల పెద్దాస్పత్రి బ్లడ్ బ్యాంకులో రాబోయే మూడు రోజులకు సైతం రిజిస్టర్‌లో ముందుగానే సంతకాలు చేసిన పరిస్థితి కనిపించింది. ఈ విషయాన్ని ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ తనిఖీల్లో స్వయంగా తెలుసుకున్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే ఆస్పత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి.

నాలుగురోజుల్లో చక్కదిద్దుతా



నాలుగు రోజుల్లో పరిస్థితి మొత్తం చక్కదిద్దుతా. ఇప్పటికే నేను తనిఖీలు చేస్తున్నాను. అన్ని విభాగాలను రోజూ చూస్తున్నా. ఆస్పత్రిలో సేవలందించకుండా వెళ్లేవారిపై చర్యలు తీసుకుంటా. పేషెంట్‌కు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తా. అన్ని రకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకుంటున్నా.

– డాక్టర్ సిద్ధానాయక్, ప్రభుత్వ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్

శ్రీధర్‌రెడ్డి మనకొద్దు బాబోయ్..

- టీడీపీలోకి తీసుకోవద్దంటూ ఆ పార్టీ జిల్లా నేతల అల్టిమేటం
- రూరల్ టీడీపీ ఇన్‌చార్జిగా అజీజ్ కొనసాగింపు
- కోటంరెడ్డి హైడ్రామా అట్టర్‌ఫ్లాప్
- ఫోన్ ట్యాపింగ్ జరగలేదని తేల్చిన స్నేహితుడు
- వారంరోజుల ఎపిసోడ్‌పై ఏవగింపు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'ఏదో జరుగుతుంది అనుకుంటే.. ఇంకేదో జరుగుతోంది..'.. కోటంరెడ్డి బ్రదర్స్ విషయంలో ప్రస్తుతం అలాంటి పరిస్థితే నడుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ పేరుతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆడిన హైడ్రామా అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఆయన్ను తెలుగుదేశంలోకి తీసుకోవద్దని ఆ పార్టీ నేతలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో బ్రదర్స్‌కు మైండ్‌బ్లాక్ అయ్యింది. ఇద్దరి రాజకీయ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి.

సంవత్సరంగా..

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రణాళిక ప్రకారమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ వచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇచ్చింది. ఎమ్మెల్యేకు అన్నివిధాలా స్వేచ్ఛ ఇచ్చింది. దీన్ని అలుసుగా తీసుకున్న కోటంరెడ్డి తన సోదరుడిని షాడో ఎమ్మెల్యేగా పెట్టారు. పార్టీలతో సంబంధం లేకుండా దందాలు, దౌర్జన్యకాండ చేసి ఆర్థికంగా ఊహించని స్థాయికి వెళ్లారు. వైఎస్సార్‌సీపీలో ఉంటే టికెట్‌కే ఎసరొస్తుందని ఎమ్మెల్యే భావించారు. అప్పటికే ఎమ్మెల్యే వల్ల తీవ్ర ఇబ్బందులు పడిన టీడీపీ నాయకులు ఆయన్ను ఒంటరి చేయాలని ట్రాప్ చేశారు. ఇదంతా తన బలమేనని ఊహించుకున్న ఎమ్మెల్యే టీడీపీ వలలో చిక్కుకున్నాడు.

ఫోన్ ట్యాపింగ్ జరిగితే కదా..

ఫోన్ ట్యాపింగ్ ఎపిసోడ్‌కు ముందే శ్రీధర్‌రెడ్డి జిల్లా మాజీ మంత్రి ప్రధాన అనుచరుడి ద్వారా చంద్రబాబును కలిశారు. అంతకు ముందే నారా లోకేశ్‌తో మంతనాలు చేశారు. ఎమ్మెల్యే సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో వ్యాపార సంబంధాలు ఉండటంతో ఆయనతో మాట్లాడుకున్నారు. ఒకప్పుడు టీడీపీలో కీలకంగా ఉండి నేడు బీజేపీలో ఉన్న ఓ నాయకుడితో రహస్య చర్చలు జరిపారు. అంతా ఓకే అనుకున్న తర్వాత వాయిస్ రికార్డ్‌ను చూపించి నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ హైడ్రామా నడిపారు. కానీ ఎమ్మెల్యే స్నేహితుడు లంకా రామశివారెడ్డి ఇదంతా ఉత్తిదేనని, అది వాయిస్ రికార్డ్ అని తేల్చడంతో ఫ్లాప్ షోగా తేలిపోయింది. కాగా ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్రానికి లేఖ రాశానంటూ ఎమ్మెల్యే హడావుడి చేశారు. విచారణ జరిపించాలంటే వెంటనే సంబంధిత ఫోన్‌ను పోలీసులకు ఇవ్వాలి. అవసరమైతే కోర్టు ద్వారానైనా విచారణ చేయించుకోవాలి. కానీ అలా జరగలేదు. అదే కోటంరెడ్డి స్నేహితుడు రామశివారెడ్డి మాత్రం తన ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి వాస్తవాలు తేల్చండంటూ చెప్పినట్లుగా కూడా ఎమ్మెల్యే చెప్పలేకపోయాడు. ఇక ఈ ఎపిసోడ్ రక్తికట్టదని తెలుసుకుని విచారణ పేరుతో ఆ నెపం కేంద్రంపై నెట్టేశారు.

ఆయనొస్తే మేం ఉండం

ప్రణాళిక ప్రకారమే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేను ట్రాప్‌లోకి దించిన టీడీపీ ఇప్పుడు మాత్రం మాకేమీ తెలియదని చేతులెత్తేసింది. ఆయన రాకను జీర్ణించుకోలేని నేతలు తమ పార్టీ అధినేత చంద్రబాబుకు ఏకంగా హెచ్చరికలే చేశారు. రెండురోజుల క్రితం చంద్రబాబు నెల్లూరు నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. ఈక్రమంలో టీడీపీ కీలక నేతలంతా కోటంరెడ్డి అరాచకాలపై ఏకరువు పెట్టారు. ఆయన టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతపై హత్యాయత్నం నుంచి మరికొందరు నాయకులపై దాడులు చేయించడం, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్థిక మూలాలపై కోలుకోలేని దెబ్బతీసిన వైనాన్ని వివరించారు. మూడున్నరేళ్లపాటు అష్టకష్టాలు పెట్టిన వ్యక్తికి మేమే ఎలా జేజేలు కొట్టాలంటూ బాబునే నిలదీశారని తెలిసింది. ఆయన పార్టీ కండువా కప్పుకోక ముందే నేనే అభ్యర్థినని ఎలా ప్రకటించుకుంటారని ప్రశ్నించారని సమాచారం. శ్రీధర్‌రెడ్డి వస్తే మాత్రం మేం వెళ్లిపోతామని తెగేసి చెప్పడంతో కంగుతిన్న బాబు హామీ ఉత్తిదేనని అజీజ్‌నే ఇన్‌చార్జిగా కొనసాగిస్తానని చెప్పారని ప్రచారం జరుగుతోంది. అబ్దుల్ అజీజ్ త్వరలోనే నియోజకవర్గంలో పాదయాత్ర ద్వారా కార్యకర్తలను కలిసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడని తెలిసింది.

అచ్చెన్నా.. మా సంగతి చూడు

పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో శ్రీధర్‌రెడ్డి తన సోదరుడు గిరిధర్‌రెడ్డిని రంగంలోకి దింపారు. అచ్చెన్నాయుడితో వ్యాపార సంబంధాల నేపథ్యంలో అతని ద్వారానైనా చంద్రబాబును ఒప్పించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని తెలిసింది. మూడు రోజుల క్రితం గిరిధర్‌రెడ్డి అచ్చెన్నాయుడిని కలిసి చంద్రబాబుతో చెప్పి టికెట్ ఇప్పించాలని అడిగినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. నేనైతే హామీ ఇవ్వలేనని.. బాబుకు చెప్పి చూస్తానంటూ అచ్చెన్నాయుడు చెప్పినట్లు సమాచారం. ఏది ఏమైనా కోటంరెడ్డి ఎపిసోడ్ తేలిపోవడం జిల్లా రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు వేళాయె..

- అమల్లోకి ఎన్నికల కోడ్

నెల్లూరు(అర్బన్)/నెల్లూరు(సెంట్రల్): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కేవీఎస్ చక్రధర్‌బాబు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని రాజకీయ పార్టీలు, అధికారులు గమనించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మార్చి 13వ తేదీన పోలింగ్, 16వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు.

- ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీగా వై.శ్రీనివాసులురెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీగా వి.బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు. వీరి పదవీకాలం మార్చి నెలలో ముగుస్తుంది.



శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డి

- త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నుంచి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, టీడీపీ నుంచి కంచర్ల శ్రీకాంత్, పీడీఎఫ్ తరఫున వెంకటేశ్వరరెడ్డి బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ తరఫున పి.చంద్రశేఖర్‌రెడ్డి, పీడీఎఫ్ తరఫున బాబురెడ్డి బరిలో ఉన్నారు.

సోమశిలలో 66.225 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 66.225 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1,853 క్యూసెక్కుల వంతున నీరు వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 3,920 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. 98.960 మీటర్లుగా నమోదైంది. సగటున 314 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.



సోమశిల జలాశయం (ఫైల్)

రూరల్ అభ్యర్థిగా పోటీ చేస్తావా?

- శ్రీధర్‌రెడ్డికి ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సవాల్
- ప్రజలే ఆయనకు గుణపాఠం చెబుతారని వెల్లడి

నెల్లూరు రూరల్: 'వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నేనే పోటీ చేస్తా. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి దమ్ముంటే పోటీ చేయాలి.' అని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన గురువారం నగరంలోని తన కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. నాటకాలు వేయడంలో ఆయన దిట్ట అన్నారు. తాను 25 ఏళ్లుగా మచ్చలేని నాయకుడిగా ఉన్నానని, తనను విమర్శించే స్థాయి కోటంరెడ్డికి లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించిన వ్యక్తి శ్రీధర్‌రెడ్డి అని, ఎన్నో అరాచకాలు చేశాడని, ప్రజలే ఆయనకు గుణపాఠం చెప్తారన్నారు. ఎమ్మెల్యే చేసిన దందాలను త్వరలో ప్రజలకు వివరిస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పక్కన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజలు గమనిస్తున్నారు : కాకాణి

ఫోన్ ట్యాపింగ్ పేరుతో ప్రభుత్వంపై రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కాకాణి అన్నారు. కాల్ రికార్డింగ్ మాత్రమేనని లంకా రామశివారెడ్డి అంగీకరించాడన్నారు. ప్రజలు గమనిస్తున్నారని, నమ్మకద్రోహం చేసిన శ్రీధర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్షమించరని చెప్పారు. రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అరాచకాలకు కాలం చెల్లిందన్నారు. సమావేశంలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లతో చర్చలు

రూరల్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లతో మంత్రి, ఆదాల ఎంపీ కార్యాలయంలో సమావేశమయ్యారు. కోటంరెడ్డి సోదరులకు భయపడొద్దని, తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్ల జోలికి వస్తే వారిని తగిన విధంగా గుణపాఠం చెబుతామన్నారు.

దోపిడీ యత్నం కేసులో నలుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : ఒంటరిగా వెళ్లేవారిని కత్తులతో బెదిరించి దోపిడీకి యత్నిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారులో ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు గురువారం రాత్రి తన కార్యాలయంలో నిందితుల వివరాలు వెల్లడించారు. పొదలకూరు రోడ్డు జేవీ ఆర్ కాలనీకి చెందిన టి.అఖిల్ అలియాస్ చిన్ను, లేక్‌వ్యూ కాలనీకి చెందిన కె.హరికుమార్ అలియాస్ చింటూ, రాజీవ్ గృహకల్పకు చెందిన బి.నారాయణ, కోటమిట్టకు చెందిన యూనస్‌లు స్నేహితులు. వీరు మరో ఇద్దరితో కలిసి గురువారం తెల్లవారుజామున సండేమార్కెట్ వద్ద కత్తులతో ఒంటరిగా వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీకి యత్నించారు. దీనిపై సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు ఘటనా స్థలానికి చేరుకుని అఖిల్, హరికుమార్, నారాయణ, యూనస్‌లను అరెస్ట్ చేశారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, పట్టుబడిన వారు పాతనేరస్తులని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎవరూ చేయని విధంగా అభివృద్ధి పనులు

- త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తా
- నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్



ఫ్లై ఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు నగరంలో ఇప్పటి వరకు ఎవరూ చేయని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలో వీటిని పూర్తి చేసి మీడియా సమక్షంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి ప్రజలకు తెలియజేస్తానని నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. నెల్లూరు నగరంలోని హరనాథపురం సెంటర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ ఫ్లై ఓవర్ నిర్మాణం మరో 45 రోజుల పని ఉందని, దాదాపు పూర్తి కావస్తోందన్నారు. ఫ్లైఓవర్ కింది వైపు సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించానన్నారు. సర్వేపల్లి కాలువలోకి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మురికి నీరు రాకుండా డ్రైయిన్స్ నిర్మించేందుకు, అలాగే కాలువలోకి పెన్నా నీరు, వర్షపు నీరు మాత్రమే ప్రవహించే విధంగా డిజైన్ చేయాలని అధికారులకు తెలిపానన్నారు.

ఇళ్లల్లో కూర్చొని మాట్లాడడం హాస్యాస్పదం

నెల్లూరు నగరంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ప్రజల మధ్య తిరగకుండా కొందరు ఇళ్లల్లో కూర్చొని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే అనిల్ అన్నారు. ఫ్లై ఓవర్ పనులు పూర్తయితే దానిపై ఎవరెవరు వాహనాల్లో తిరుగుతారో వారికి ఏమి అభివృద్ధి చేశానో అర్థమవుతుందన్నారు. సర్వేపల్లి కాలువ గట్టుపై నివసిస్తున్న వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎవరి ఇళ్లు తొలగించకుండా కాలువకు ఇరువైపులా ప్రహరీ నిర్మాణం పూర్తయిన తర్వాత 20 అడుగుల రోడ్డు వస్తుందన్నారు. అప్పుడు ఈ ప్రాంతం అంతా ఎలా ఉంటుందో చూస్తే అభివృద్ధి ఏంటో తెలుస్తుందన్నారు. గతంలో పెన్నా బ్రిడ్జి ఎలా ఉందో.. ప్రస్తుతం ఎలా ఉందో చూడాలన్నారు. త్వరలో మైపాడు రోడ్డు నిర్మాణం, జాఫర్ సాహెబ్ కాలువ పనులు పూర్తయితే అభివృద్ధి ఎలా ఉంటుందో.. అనిల్ ఏం చేశాడో తెలుస్తుందన్నారు. నాలుగేళ్లకు ఒకసారి తిరిగేవారు ఒకరు.. ప్రెస్‌మీట్లకే పరిమితమైన వారు మరొకరు.. ఇంకొకరు వస్తారో లేదో తెలీదు.. ఎప్పుడు వస్తారో కూడా తెలియని వారంతా నన్ను ఓడిస్తామని పగటి కలలు కంటున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, వేలూరు మహేష్, నీలి రాఘవరావు, 45వ డివిజన్ ఇన్‌చార్జి నేతాజి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో నిందితులకు శిక్ష

- ఎస్పీ సీహెచ్ విజయారావు



మాట్లాడుతున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు(క్రైమ్) : పోక్సో కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చూడాలని ఎస్పీ సీహెచ్ విజయారావు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆయన సిబ్బందితో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోక్సో, మిస్సింగ్ కేసుల నమోదు, దర్యాప్తు తదితరాలపై సమీక్షించి సిబ్బందికి పలు, సూచనలు సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోక్సో కేసుల్లో 21 రోజుల్లో విచారణ, చార్జ్‌షీట్ దాఖలు, ట్రయల్ రన్ పూర్తి చేసి కోర్టుకు సమర్పించాలని, తద్వారా త్వరితగతిన నిందితులకు శిక్షలు పడుతాయన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తప్పిపోయిన వారి సమగ్ర సమాచారం సేకరించి సైబర్, ఐటీ కోర్ సిబ్బంది సహకారంతో సాంకేతికత ఆధారంగా వారిని గుర్తించి బాధిత కుటుంబాల చెంతకు చేర్చాలన్నారు. పోక్సో, మిస్సింగ్ కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్య లు తప్పవని హెచ్చరించారు. 2021లో తప్పిపోయిన 504 మందిని, 2022లో 661 మందిని, ఈ ఏడాది ఇప్పటివరకు 28 మంది బాలబాలికలు, మహిళలను సంరక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేవన్నారు. ఏహెచ్‌టీయూ బృందం, స్థానిక పోలీసుల సమన్వయంతో పనిచేసి మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రులపై తూ.కొ. దాడులు

- 22 కేసుల నమోదు



ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న తూనికలు, కొలతల శాఖాధికారులు

నెల్లూరు (అర్బన్) : నగరంలోని పలు ఆస్పత్రులపై తూనికలు, కొలతల శాఖాధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నగరంలోని ఎయిమ్స్ (అనసూయ), రిచ్, లోటస్, రెయిన్‌బో, కిమ్స్, అపోలో, మెడికవర్ తదితర ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీ లేని పరికరాలను కనుగొన్నారు. వాటిని అధిక ధరలకు రోగులకు విక్రయిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. అలాగే పలు ఆస్పత్రుల్లోని వేయింగ్ స్కేల్ (మెషీన్లు)లకు లైసెన్సులు లేకపోవడం గమనించారు. 16 పరికరాలకు ఎమ్మార్పీ లేకపోవడం, ఒక పరికరాన్ని అధిక ధరలకు విక్రయించడం (ఉదాహరణకు స్టంట్), ఆరు వేయింగ్ మెషీన్లు, మరో 15 ఇతర పరికరాలు కలిపి మొత్తం 32 రకాల పరికరాలకు సంబంధించి అధికారులు 22 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ కె.థామస్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన ఆస్పత్రుల యాజమాన్యాలపై కేసులు నమోదు చేశామన్నారు. దాడులు కొనసాగిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ కంట్రోలర్లు ఈశ్వర్‌రావు, లిల్లీ, ఇన్‌స్పెక్టర్లు సాయి శ్రీకర్, కరిముల్లా, అనిల్‌కుమార్, రాందాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కుల దూషణ కేసులో 12 మందికి జైలు

నెల్లూరు(లీగల్) : కులం పేరుతో దూషించి దాడి చేశారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఒకే కుటుంబానికి చెందిన 11 మందితో పాటు మరో వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. ఉదయగిరి మండలం, సల్వరాబాద్ గ్రామంలో దారపనేని రవీంద్ర, నారాయణ, బాలకృష్ణ, చెన్నయ్య, కేశవనారాయణ, చెన్నారాయుడు, కేశవులు, చిన్నక్క, రత్తమ్మ, లక్ష్మీదేవి, కొండమ్మలతో పాటు తిరువీధి చెన్నారాయుడు అనే 12 మందికి 6 నెలలు జైలుశిక్షతో పాటు రూ.1,500 చొప్పున జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.మాధురి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. సల్వరాబాద్ గ్రామంలో సర్వే నంబరు 740లో 2.22 సెంట్ల భూమిని గొల్లపల్లి చినబాలఓబయ్యకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయన భార్య లక్ష్మమ్మ మరికొంత మంది కూలీలతో 2012 జనవరి 3న ఉదయం 11 గంటల ప్రాంతంలో పొలాన్ని దున్నుతుండగా పైన పేర్కొన్న 12 మంది చినబాలఓబయ్య, లక్ష్మమ్మను కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యానికి పాల్పడి దాడి చేశారు. దీంతో లక్ష్మమ్మ ఉదయగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు అనంతరం 12 మందిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు


బ్రాయిలర్ (లైవ్)	: 107
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 190
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 210
లేయర్ చికెన్	: 128



పొదలకూరు

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.44
సన్నవి	: రూ.32
పండ్లు	: రూ.12



నిబంధనల మేరకు ఆక్వా జోన్లు

- కలెక్టర్ చక్రధర్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు (అర్బన్) : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం ఆక్వా జోన్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ చక్రధర్‌బాబు సూచించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో జిల్లాలో ఆక్వా జోన్ల ఏర్పాటు, వాటి ఆవశ్యకతపై గురువారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా సాగును పెంపొందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆక్వా సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఆక్వా సాగు చేసే రైతులకు విద్యుత్‌పై ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం ద్వారా ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహిస్తోందన్నారు. 15 మండలాల్లోని 98 పంచాయతీల్లో ఆక్వా సాగు చేస్తున్న 12557.42 హెక్టార్ల భూమిని ఆక్వా జోన్‌లోకి తీసుకొచ్చేందుకు కమిటీ ఆమోదం తెలిపిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.